## క్లుప్తంగా

### కోటి బిల్వార్చన స్థలం పరిశీలన

తుని రూరల్: వి.కొత్తూరు శివారున ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల ఎదురుగా వచ్చే నెల 4న అయ్యప్ప స్వామి కోటి బిల్వార్చన, పూడిపూజ నిర్వహించనున్నారు. ఈ స్థలాన్ని రూరల్ సీఐ ఎ.సన్యాసిరావు, ఎస్సై విజయబాబు మంగళవారం పరిశీలించారు. అనంతరం ఏర్పాట్లు, ట్రాఫిక్ తదితర అంశాలపై నిర్వాహకులతో చర్చించారు. కోటి బిల్వార్చనకు శబరిమలై దేవస్థానం నుంచి ప్రధానార్చకుడితో పాటు ప్రముఖులు హాజరు కానున్నారని నిర్వాహకులు తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి, విశాఖపట్నం జిల్లాల నుంచి అయ్యప్ప మాలధారణ చేసిన 10 వేల మంది భక్తులు కోటి బిల్వార్చన, పడిపూజలో పాల్గొంటారని చెప్పారు. అదే రోజు ఉదయం కత్రాళ్ల కొండ అయ్యప్పస్వామి ఆలయం నుంచి తుని పట్టణంలోని వీధుల మీదుగా కోటి బిల్వార్చన వేదిక వరకూ అయ్యప్ప స్వాములతో శోభా యాత్ర నిర్వహిస్తామని తెలిపారు. ఈ స్థలం జాతీయ రహదారిని ఆనకుని ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేయాలని, పూజా కార్యక్రమాలకు వచ్చే వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాన్ని కేటాయించాలని సీఐ సూచించారు.

### రౌతులపూడి - తుని బస్సుకు వినతి

తుని: రౌతులపూడి నుంచి శృంగధార, గిడజాం, పారుపాక మీదుగా తునికి ఆర్టీసీ బస్సు నడపాల్సిందిగా రౌతులపూడికి చెందిన బి.లోవరాజు విజ్ఞప్తి చేశారు. మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో ఫోన్ ద్వారా ఈ విజ్ఞప్తి చేశారని ఆర్టీసీ తుని డిపో మేనేజర్ ఎన్.కిరణ్ కుమార్ తెలిపారు. ఇప్పటికే ఉదయం 7.30 గంటలకు ఒక సర్వీసు నడుపుతున్నామని, మరో బస్సు నడిపే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపామన్నారు. ఆర్టీసీ బస్సులలో టికెట్లు ఇవ్వడానికి కండక్టర్లు ప్రయాణికుల వద్దకు రావడం లేదని, కనీసం టికెట్లు తీసుకోమని కూడా అడగడం లేదని ఏలేశ్వరం నుంచి కె.రాంబాబు ఫిర్యాదు చేశారన్నారు. రౌతులపూడి మండలం పైడిపాలకు ఆర్టీసీ బస్సు నడపాల్సిందిగా అక్కడి ఎంపీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం విజ్ఞప్తి చేశారని తెలిపారు.

### విద్యార్థులను ప్రోత్సహించాలి



వీసీ పద్మరాజుకు చెక్కును అందిస్తున్న శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత గుంటూరు శ్యామ్

బోట్‌క్లబ్: నన్నయ వర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్‌కు కాకినాడ శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత జి.తణుకులు(శ్యామ్) వీసీ కె.పద్మరాజును కలిసి రూ.లక్ష విలువైన ఎండోమెంట్ చెక్కును మంగళవారం అందజేశారు. వీసీ మాట్లాడుతూ కాకినాడ ఎంఎస్ఎన్ క్యాంపస్ పూర్వ విద్యార్థి శ్యామ్ అందజేసిన రూ.లక్షకు వచ్చే వడ్డీని సదరు క్యాంపస్ ఎంసీఏ మొదటి సంవత్సరంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థికి ఏటా బహుమతిగా అందిస్తామన్నారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ తాను చదువుకున్న కళాశాల్లో విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఎండోమెంట్ ఫండ్ ఇచ్చినట్లు చెప్పారు. శ్యామ్‌ను వర్సిటీ రిజిస్ట్రార్ జి.సుధాకర్, ఏయూ విశ్రాంత ప్రొఫెసర్ ఐ.దోసగిరిరావు, కాకినాడ క్యాంపస్ ఇన్‌చార్జి ఎస్.ప్రశాంతి అభినందించారు.

### జాతీయ స్థాయి యోగా పోటీలకు కాకినాడ క్రీడాకారులు



పోటీలలో పతకాలు సాధించిన క్రీడాకారులతో యోగా గురువు చిట్టిబాబు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): భీమవరంలో మంగళవారం జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీలలో కాకినాడ క్రీడాకారుల ప్రతిభ కనపరచి జాతీయస్థాయికి ఎంపికయ్యారని ఏపీ రాష్ట్ర యోగా విద్యాపీఠం అధ్యక్షుడు చిట్టూరి చిట్టిబాబు తెలిపారు. యోగా అథ్లెట్ బొజ్జ లక్ష్మీ వెంకటసాయి బంగారు పతకం, బీవీఎస్ సాయిరాం రజత, జి.లహరి కాంస్య పతకాలు సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యారన్నారు. పశ్చిమ బెంగాల్‌లో నవంబరులో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ యోగా కోచ్ ధర్మాడి శాంతాప్రసాద్, యోగా అథ్లెట్ మహ్మద్ యాసిన్, యోగా విద్యార్థులు పాల్గొన్నారు.

### బస్సును ఢీకొని ఇద్దరికి గాయాలు

కాకినాడ క్రైం: కాకినాడలో ఇద్దరు విద్యార్థులు గాయాలపాలయ్యారు. అతి వేగంతో ద్విచక్ర వాహనాన్ని నడిపి బస్సును ఢీకొట్టి ఆసుపత్రిపాలయ్యారు. కాకినాడకు చెందిన రెడ్డి, ప్రకాష్ అనే 19 ఏళ్ల ఇద్దరు విద్యార్థులు స్థానిక పీఆర్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నారు. మంగళవారం సాయంత్రం కళాశాల నుంచి కేటీఎం బైక్‌పై అతి వేగంగా వెళుతూ తెలుగు తల్లి విగ్రహం సమీపంలో రామచంద్రపురం వెళుతున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కేటీఎం బైకు పూర్తిగా దెబ్బతినగా బస్సు ముందు భాగం పాక్షికంగా ధ్వంసమైంది. విద్యార్థులిద్దరూ గాయాలపాలై ఆసుపత్రిలో చేరారు. వారి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఘటనపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

# డిగ్రీ కళాశాల సాకారం!

- అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ ప్రకటన
- రూ.18 కోట్ల నిధుల మంజూరుకు అంగీకారం



సామర్లకోటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

సామర్లకోట: మూడు మండలాల (కిర్లంపూడి, పిఠాపురం, సామర్లకోట) ముఖ్యకూడలిలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలను డిగ్రీ కళాశాలగా అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అంగీకారం తెలపడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. రూ.18 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఇటీవలి సభలో ప్రకటించిన విషయం తెలిసిందే. 1972వ సంవత్సరంలో ఇక్కడ జూనియర్ కళాశాల వచ్చినప్పటికీ డిగ్రీ కళాశాలకు మోక్షం లభించలేదు. 1994 నుంచి ఎమ్మెల్యే అభ్యర్థులుగా పంతం పద్మనాభం, బొడ్డు భాస్కరరామారావు, తోట గోపాలకృష్ణ, పంతం గాంధీమోహన్, నిమ్మకాయల చినరాజప్ప ఈ కళాశాలను డిగ్రీ కళాశాలగా చేస్తామనే హామీ కలగానే మిగిలిపోయింది.

**చెప్పగానే ఓకే చేసేశారు..**

ఈ నెల 12న సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన బహిరంగ సభలో వైఎస్సార్ సీపీ పెద్దాపురం కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు జూనియర్ కళాశాలను డిగ్రీ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. దాంతో సీఎం జగన్ వెంటనే అందుకు అవసరమైన రూ.18 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

**వసతులు ఉన్నా..**

సుమారు 30 ఎకరాల స్థలం ఉన్న కళాశాలలో ఇప్పటికే డిగ్రీ కళాశాల ఏర్పాటు కావాల్సి ఉంది. ఈ కళాశాల ఆవరణకు ఒక వైపు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మరో వైపు జెడ్పీ బాలికోన్నత పాఠశాల, ఇంకో వైపు గిరిజన సంక్షేమ పాఠశాల ఉన్నాయి. పట్టణ ప్రజల అవసరాలను గుర్తించి ప్రైవేటు యజమానులు ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోనే డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశారు. సామర్లకోటలో డిగ్రీ కళాశాల లేకపోవడంతో ఆ కళాశాలకు మంచి డిమాండ్ పెరిగింది. అయితే ఆ కళాశాలకు ఆటస్థలం గాని సరైన వసతులు లేవు.

### కళాశాలను సద్వినియోగం చేసుకోవాలి



సామర్లకోటకు వస్తున్న డిగ్రీ కళాశాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ అనేక మంది క్రీడాకారులను తయారు చేసింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆధునాతన ల్యాబ్ సదుపాయం ఉంది.

– ఆవాల లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, సామర్లకోట

### చదువుకున్న కళాశాలను అభివృద్ధి చేయడం అదృష్టం



తాను చదువుకున్న కళాశాలను అభివృద్ధి చేసే అవకాశం తనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నాను. డిగ్రీ కళాశాలతో ప్రతి పేద విద్యార్థీ డిగ్రీ చేసే అవకాశం ఉంటుంది. ఇంటర్‌లో వొకేషనల్ ఉండడంతో పాలిటెక్నిక్ కళాశాలకు ప్రయత్నం చేస్తాను.

– దవులూరి దొరబాబు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, సామర్లకోట

### విజయవాడకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

తుని: దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని విజయవాడకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ ఎన్.కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ప్రతి రోజూ రాత్రి 11 గంటలకు, ఉదయం 6.30, 7.15, 8.15 గంటలకు విజయవాడకు బస్సులు బయలుదేరుతాయన్నారు. ఉదయం 5.30కు, మధ్యాహ్నం 3 గంటలకు తుని నుంచి శ్రీశైలానికి బస్సులు నడుపుతున్నామని పేర్కొన్నారు. భవానీ భక్తులకు కోరుకున్న క్షేత్రం నుంచి విజయవాడ, శ్రీశైలం క్షేత్రాలకు బస్సులు నడుపుతామని తెలిపారు. భవానీ దీక్షధారులు, ఇతర భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కిరణ్‌కుమార్ కోరారు. వివరాలకు 73829 13216, 73829 13016, 73306 51904 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలేశ్వరం: స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.సునీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ(మాథ్స్, బోటనీ)ల్లో చేరేందుకు గురువారం లోగా రూ.400 ఫీజుతో, ఈ నెల 21 లోగా అపరాధ రుసుంతో చేరవచ్చని వివరించారు. ఆసక్తి ఉన్న వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలకు రావాలన్నారు. స్పాట్ అడ్మిషన్లతో చేరేవారు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనకు అర్హులు కారని ఆమె తెలిపారు.

# సురక్ష శిబిరాలతో మెరుగైన వైద్యం

**ఎమ్మెల్యే పెండెం దొరబాబు**



మూలపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే దొరబాబు



శిబిరంలో వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు



మూలపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



రోగులకు మందులు అందజేస్తున్న సర్పంచ్, తహసీల్దార్ తదితరులు

కొత్తపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలతో ప్రతిఒక్కరికీ మెరుగైన వైద్యం అందుతోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని మూలపేటలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాల వద్ద మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రజలతో మాట్లాడి అక్కడ అందుతున్న సేవలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యం అందించి ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఇప్పటివరకూ ఎంతోమంది పాలకులను మనం చూసి ఉండొచ్చని, అయితే ప్రజా సంక్షేమం కోసం ఇంతగా ఆలోచించిన కుటుంబం మాత్రం కేవలం వైఎస్సార్ కుటుంబం మాత్రమే అన్నారు. మంచి చేసే ప్రభుత్వాన్ని మళ్లీ నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన న్యూట్రిషన్ స్టాల్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ కంబాల మౌనిక, ఎంపీటీసీలు అద్దా పాప, గోగు లోవకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, కంబాల లక్ష్మణరావు, అద్దా త్రిమూర్తులు, గోగు జగన్నాథం, మండల కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, ఎంపీడీఓ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**సురక్షను సద్వినియోగం చేసుకోండి**

పిఠాపురం: అందరికీ మెరుగైన వైద్యం అందించాలనే సదుద్దేశంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు కోరారు. మంగళవారం గొల్లప్రోలులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఆయన సందర్శించి వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక వైద్య సదుపాయాలను ప్రజల ఇంటి ముంగిటకే తీసుకురావడానికే ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో గొల్లప్రోలు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మైనం రాజా, అన్నవరం దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితుడు మొగలి అయ్యారావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మొగలి బాబ్జి, సొసైటీ అధ్యక్షుడు జ్యోతుల భీముడు, జేసీఎస్ కన్వీనర్ మొగలి సాంబశివరావు, నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**450 మందికి ఆరోగ్య పరీక్షలు**

సామర్లకోట: మాధవపట్నం–1 సచివాలయం పరిధిలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 450 మందికి పరీక్షలు చేసి మందులు అంద జేసినట్టు తహసీల్దార్ ఎస్ఎల్వీ కుమారి తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు పి.ప్రశాంత్, శ్రీహిమవతి రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, సర్పంచ్ మేడిశెట్టి సుగుణ, ఎంపీటీసీ సభ్యులు మేడిశెట్టి దుర్గాదేవి, గుత్తుల కృష్ణార్జునరావు, పంచాయతీ కార్యదర్శి ఫణికుమార్ తదితరులు రోగులకు సేవలందించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆరోగ్య పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా మందులు అందజేశారు.

## ఓటర్ల జాబితా సవరణకు సహకరించండి

- ఆర్డీవో జేవీఎస్ రామారావు
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



ప్రజా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో చేపట్టే ఓటర్ల జాబితా సవరణ మరింత వేగవంతంగా జరుగుతోందని, అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జేవీఎస్ రామారావు కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ చాంబర్‌లో మంగళవారం ఓటర్ జాబితా సవరణపై వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా రీ సర్వే మరింత వేగవంతం చేసినట్టు ఆర్డీఓ తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనలపై ప్రజా ప్రతినిధులు మరింత పూర్తి అవగాహన పెంచుకోవాలని కోరారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో 4629 చేర్పులు చేయగా, 7355 మంది ఓటర్లను తొలగించినట్టు తెలిపారు. ఒకే డోర్ నెంబర్‌తో 10 కంటే ఎక్కువ మంది ఓటర్లు గల డోర్ నెంబర్లు 191 ఉన్నాయన్నారు. వీటికి 680 దరఖాస్తులు అందాయన్నారు. అనంతరం ఓటర్ల జాబితా విధానంపై ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వి.జితేంద్ర, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, మేనేజర్ జ్యోతిరాణి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు (వైఎస్సార్ సీపీ), రంధి సత్యనారాయణ (టీడీపీ), చింతా శ్రీనివాసరావు (వైఎస్సార్ సీపీ)లతో పాటు ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

## దసరా సెలవుల్లో సరదాగా..

- విజ్ఞాన శిబిరాలకు గ్రంథాలయాలు సిద్ధం
- రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహణ
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు



శిక్షణ శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించేలా దసరా సెలవుల్లో ప్రత్యేక శిబిరాల నిర్వహణకు గ్రంథాలయ సంస్థ ఏర్పాట్లు చేసింది. పాఠశాలలకు ఈ నెల 14 నుంచి 24వ తేది వరకూ దసరా సెలవులు ప్రకటించిన నేపథ్యంలో 10 రోజుల పాటు గ్రంథాలయంలో విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యే వరకూ ఈ కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా అధికారి గ్రంథాలయాలకు ఆదేశాలు జారీ చేశారు. సెలవుల్లో విద్యార్థుల సమయం వృథా కాకుండా వారిలో పఠనాశక్తిని కలిగించడం, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించడం లక్ష్యంగా ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందుకోసం విద్యార్థులను ఆకట్టుకునేలా వివిధ అంశాలపై 10 రోజులు శిక్షణ ఇచ్చేందుకు మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహించనున్నారు.

- నగరంలో జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు గాంధీనగర్ కుళాయిచెరువు పార్కు, ఆనంద భారతి గ్రౌండ్, జగన్నాథపురంతో పాటు మరో 6 బీడీసీ (పుస్తక నిక్షిప్త కేంద్రాలు) ఉన్నాయి.
- పుస్తక పఠనం, కథలు చెప్పించడం, ప్రముఖులతో అవగాహన సదస్సులు, అలాగే విజేతల పుస్తకాలతో పాటు కవులు, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత విశేషాలు, వివిధ దినపత్రికలు, చిన్నారులకు ఉపయోగపడే పుస్తకాలు గ్రంథాలయాల్లో ఏర్పాటు చేశారు. రోటరీ, లయన్స్, స్వచ్ఛంద సేవా సంస్థలు, జన విజ్ఞాన వేదిక సభ్యులు, పేద విద్యార్థులకు స్వచ్ఛంద సేవ చేయాలనుకునే వారికి ఇది మంచి అవకాశం. స్పోకెన్ ఇంగ్లీష్, తెలుగు పండితుల నుంచి మంచి ప్రతిభ ఉన్నవారు ఈ గ్రంథాలయాల ద్వారా స్వచ్ఛందంగా సేవలు అందించేందుకు ఆ సంస్థ అవకాశం కల్పిస్తోంది.

**రోజువారీ షెడ్యూల్ ఇదే...**

- ఉదయం 8 నుంచి 8.30 నిముషాలు.. కథలు వినడం, (వినికిడి జ్ఞానం పెంపొందించడం)
- 8.30 నుంచి 10 గంటల వరకూ.. గ్రంథాలయంలో పుస్తకాలు చదివించడం (చదువంటే మాకిష్టం)
- 10 గంటల నుంచి 10.10 వరకూ విరామం. 10.10 నిముషాల నుంచి 10.30 వరకూ పుస్తక సమీక్ష. 10.30 నుంచి 11 గంటల వరకూ కథలు చెప్పడం. 11 గంటల నుంచి 12 గంటల వరకూ స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, తదితర విభాగాల అంశాలు ఉంటాయి.

# వైభవంగా శరన్నవరాత్ర ఉత్సవాలు



పంచారామ క్షేత్రంలో నిర్వహిస్తున్న చండీ హోమం



ప్రత్యేకాలంకరణలో పురుహూతికా అమ్మవారు



అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన శ్రీరాజరాజేశ్వరీదేవి



చంద్రఘంటగా యాలకులు, పసుపుకొమ్ములు లవంగాల అలంకరణలో తాటిపర్తి అపర్ణాదేవి

పిఠాపురం: ఆదివారం నుంచి ప్రారంభమైన శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయాలకు భక్తులు పోటెత్తుతున్నారు. దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పాదగయ క్షేత్రం దసరా ఉత్సవాల సందర్భంగా భక్తులతో కిటకిటలాడుతోంది. పిఠాపురం నియోజకవర్గంలో కొత్తపల్లి గొల్లప్రోలు, పిఠాపురం మండలాల పరిధిలోని కనకదుర్గ అమ్మవారి ఆలయాలలో మూడో రోజు ప్రత్యేక పూజలు నిర్వహించగా శరన్నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని పాదగయ క్షేత్రంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శ్రీరాజరాజేశ్వరీ దేవి, అష్టాదశ శక్తి పీఠాలలో పదో శక్తి పీఠానికి అధిష్టాన దేవతైన పురుహూతికా అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో మూడో రోజు మంగళవారం రాజరాజేశ్వరీదేవి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వెలసిన అపర్ణాదేవి అమ్మవారు మూడో చంద్ర ఘంట అవతారంలో యాలకులు లవంగాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

**గాయత్రీదేవిగా అలంకరణ**

కొత్తపల్లి: శరన్ననవరాత్రుల సందర్భంగా కొమరగిరిలోని శ్రీబాలా కనకదుర్గాదేవి అమ్మవారు గాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భవానీ దీక్షాదారులతో గ్రామాలు కళకళలాడుతున్నాయి. మండలంలో వాడవాడలా అమ్మవారి ఆలయాల్లో ఆయా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దేవీనవరాత్రుల ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే వివిధ గ్రామాల్లో వేలాది మంది భవానీ దీక్ష తీసుకోవడంతో గ్రామాలన్నీ భవానీ భక్తులతో కళకళలాడుతున్నాయి.

**ఆలయాల్లో కొనసాగుతున్న పూజలు**

సామర్లకోట: శరన్నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవార్ల ఆలయాల్లో పూజలు కొనసాగుతున్నాయి. స్థానిక పంచారామ క్షేత్రంలో దుర్గాసప్తశతి పారాయణ, మహిషాసుర మర్దిని అమ్మవారికి పంచామృత అభిషేకం చేశారు. ఆలయ ఆవరణలో చండీహోమం నిర్వహించారు. బాలా త్రిపుర సుందరి అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. పట్టణ పరిధిలోని నూకాలమ్మ, కనకదుర్గ, సత్తెమ్మ తల్లి ఆలయాలలోను, రైల్వే స్టేషన్ సెంటర్, గాంధీచౌక్, బళ్లమార్కెట్ సెంటర్, కొత్తూరులలో ఏర్పాటు చేసిన అమ్మవారి శిబిరాల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో భవానీ మాలధారులు దుర్గా పారాయణ చేశారు. అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

**అన్నపూర్ణగా అభయం**

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పులు కాండ్రకోట నూకాలమ్మ, పెద్దాపురం మరిడమ్మ తల్లి మంగళవారం అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల ఈఓలు సీహెచ్.రామ్మోహనరావు, టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో వేద పండితులు, ఆసాదులు అమ్మవార్లను అలంకరించారు. అలాగే స్థానిక వర్మల వారి వీధిలోని భువనేశ్వరి పీఠంలో అమ్మవారు అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. పీఠాధిపతి చింతా గోపిశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.



కొమరగిరిలో గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



కొత్తపల్లిలో ప్రత్యేక అలంకరణలో కనకదుర్గ అమ్మవారు



అన్నపూర్ణదేవిగా కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారు